ఊరూరా ఉత్సవం

- మారెమ్మ, వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం
- ఎక్కడ చూసినా పండుగల కోలాహలం
- ప్రతిమలు, పండుగ సరుకులు కొనుగోలులో జనం బిజీ


ప్రత్యేక పూజలు అందుకుంటున్న మారెమ్మదేవి


విక్రయానికి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలు

రాయదుర్గం: హిందూ సంప్రదాయాల్లో అతిపెద్ద పండుగలైన వినాయక చవితి, మారెమ్మదేవి ఉత్సవాలు ఒకేసారి కలసి రావడంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోని పల్లె, పట్టణాల్లో పండుగ కోలాహలం కనిపిస్తోంది. మంగళవారం మారెమ్మ జాతర వేడుకలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. బుధవారం వినాయక ప్రతిమలు కొలువుదీర్చేందుకు మంటపాలు సిద్ధమయ్యాయి. బంధువులతో పాటు ఇతర ప్రాంతాలకెళ్లిన వారు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలానికి కూతవేట దూరం కర్ణాటక రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన గౌరసముద్రం మారెమ్మదేవి ఉత్సవాలు సోమవారం నుంచే ప్రారంభం కానున్నాయి. దీంతో భక్తుల తాకిడి ఎక్కువైంది. మంగళవారం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. మహిళలు వేప చీరలు, గవద కడ్డీలు గుచ్చుకొని దర్శనం పొందనున్నారు. పట్టణంలోని కోటలో వెలసిన మారెమ్మ ఆలయం వద్ద బుధవారం సిడిమాను ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దుగ్గిలమ్మ ఆలయం వద్ద తొక్కిస లాట జరగకుండా బారికేడ్లు సిద్ధం చేశారు.

జీవాల కొనుగోలుకు రూ.కోట్లు

కర్ణాటక రాష్ట్రం రాంపురంలో గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత కిటకిట లాడింది. మంగళవారం మారెమ్మ పండుగ నిర్వహిస్తుండడంతో మూగజీవాలు కొనుగోలుకు జనం క్యూకట్టారు. రూ.కోట్ల లోనే లావాదేవీ జరిగినట్లు వ్యాపారులు చెప్తున్నారు. 10 కిలోలు ఉండే పొట్టేలు రూ.7వేల నుంచి రూ.8 వేల ధర పలికింది. దీంతో వేల సంఖ్యలో జీవాలు కొనుగోలు చేసి గ్రామాలకు తరలించారు. జంతు బలి ఇచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టనున్నారు.

గణనాథుని తొలి పూజకు వేళాయె...

రాయదుర్గంటౌన్: మరో రెండు రోజుల్లో జరిగే వినాయక ఉత్సవాలకు వాడవాడలా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి పూజకు వినాయక మంటపాల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. రాయదుర్గంతోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గణనాథులు కొలువుదీరనున్నారు.పట్టణంలోని బళ్లారి రోడ్డు, నేతాజీ రోడ్డు, ఓబుళాచారీ రోడ్డు, శాంతినగర్, వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు, లక్ష్మీబజార్ ఏరియాల్లో మంటపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వినాయక విగ్రహాల కొనుగోలు కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఈ ఏడాది భారీగా మట్టి విగ్రహాలు సిద్ధం చేశారు. కొలకత్తా కళాకారులచే పట్టణంలోని శాంతినగర్‌లో పద్మశాలియ నూతన కల్యాణమంటపంలో మట్టి విగ్రహాలు తయారయ్యాయి. ఇక్కడి నుంచి అనంతపురానికి కూడా మట్టి విగ్రహాలకు ఆర్డర్లు వచ్చినట్లు తయారీదారులు తెలిపారు.


మారెమ్మదేవి జాతర కోసం రాంపురంలో జీవాలు కొనుగోలు చేసేందుకు ఎగబడిన జనం


ఉత్సవాలకు ఏర్పాటు చేసిన మంటపం

ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్/రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్: కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్‌లో ఈనెల 27న జరిగే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్తున్నారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నిర్వాహకులకు తెలియజేశారు. కళ్యాణదుర్గం పట్టణ సీఐ యువరాజ్, రాయదుర్గంలో అర్బన్ సీఐ జయనాయక్, బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. ఆదివారం స్థానిక కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్,రాయదుర్గం పట్టణం, బొమ్మనహాళ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాలు, పట్టణంలో వినాయక మంటపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో కచ్చితంగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. వేడుకల నిర్వహణ, నిమజ్జనంలో నిబంధనలు పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. అల్లర్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక చవితి వచ్చిందంటే చిన్నారులు, యువతకు పండుగే పండుగ. గణనాథుల మంటపాల ఏర్పాటు, లైటింగ్, నిమజ్జనం వరకు ఏర్పాట్లు చేస్తుంటారు. ఈ క్రమంలో చిన్నపాటి నిర్లక్ష్యమే ఒక్కోసారి ప్రాణాలమీదకు వచ్చే అవకాశం ఉంది. అలాంటి ఘటనలకు తావు లేకుండా యువత అప్రమత్తంగా ఉత్సవాలను జరుపుకోవాలని తెలియజేస్తున్నారు.

క్లుప్తంగా

భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు


గుంతల దారిలో మట్టి వేసి చదును చేస్తున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: పట్టణంలోని 17వ వార్డులో వెలసిన దుగ్గిలమ్మ జాతర ఉత్సవాలకు భక్తులు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి మధుటాకీస్ వీధి నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో వర్షపునీటి నిల్వ, గుంతలతో తీవ్ర అధ్వానంగా మారింది. మంగళవారం జాతర ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయానికి ఇటు మధు టాకీస్ నుంచి, మరోవైపు గొగ్గిరొట్టి నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఎర్రమట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ గుంతలు దారుల్లో వేసి చదును చేస్తున్నారు. ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మేస్త్రీలు పనులను పర్యవేక్షించారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదాతలను సత్కరిస్తున్న ఓంశాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి సంచాలకురాలు బీకే యోగీశ్వరి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓంశాంతి ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 46 మంది రక్తదాతలు రక్తాన్ని దానం చేసినట్లు ఓంశాంతి ప్రజా పిత సంచాలకురాలు బీకే యోగీశ్వరి తెలిపారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి వచ్చిన వైద్యుల బృందం దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఎస్‌ఐ ప్రసాద్ మాట్లాడుతూ ఓంశాంతి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఓంశాంతి సంచాలకురాలు బీకే యోగీశ్వరి మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీల మాజీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రాజయోగిని దాది 18వ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జగదీష్, వీరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం

ఉరవకొండ: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సాకే పురుషోత్తంను ఏపీ ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సాకే పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎంఈఓ మల్లికార్జున


ఎంఈఓ మల్లికార్జునను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: రాష్ట్ర ఉపాధ్యాయ కమిటీలో బొమ్మనహాళ్ ఎంఈఓ మల్లికార్జునను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్ ఎంఈఓ–2 మల్లికార్జున, డివిజన్ జాయింట్ సెక్రెటరీగా ఉద్దేహాళ్ ప్రధానోపాధ్యాయుడు వై. ఆదిశేషయ్యను ఏకగ్రీవంగా ఎన్నియ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర, డివిజన్ కమిటీలో అవకాశం కల్పించినందుకు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పట్ల చిత్రశుద్ధితో కృషి చేస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్, నాగలాపురం ప్రధానోపాధ్యాయులు సుధాకర్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

'దుర్గం' వాసికి మహబూబ్ నగర్ సబ్ జైలులో రిమాండ్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం వాసి గంగాధర్ అలియాస్ సాంబాకు తెలంగాణా రాష్ట్రం మహబూబ్ నగర్ సబ్ జైలులో రిమాండ్ విధించినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని వెంకటేశ్వర కాలనీలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటనలో బాధిత మహిళ ఫిర్యాదుతో ఈనెల 17న సాంబాపై కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన గంగాధర్ అలియాస్ సాంబాను పోలీసులు అచ్చంపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై ఉమ్మడి రాష్ట్రంలో 50 కేసుల్లో నేరస్తుడిగా ఉన్నాడు. పలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యాయి. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ప్రజలను వంచించడం చంద్రబాబు నైజం


చిన్నంపల్లిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

శెట్టూరు: ఎన్నికల సమయంలో ప్రతి సారీ అమలు చేయలేని హామీలు ఇచ్చి, అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజలను వంచించడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నంపల్లి, ఐదుకల్లు గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా బాబు ఇచ్చిన హామీలు ప్రజలకు ఇవ్వకుండా మోసగించిన విధానం చెప్పుకొచ్చారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను చెప్పిన సమయానికి ఎలా ప్రజలకు ఇచ్చి మాటనిలబెట్టుకున్నాడో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథరెడ్డి, పార్టీ అనుబంధ విభాగం నాయకులు తిప్పేస్వామి, గిరిప్రసాద్, సర్పంచ్ విరుపాక్షిగౌడ్, ఎంపీటీసీలు నగేష్, నరసింహులు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, మహిళ నాయకురాలు మంజుళమ్మచ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు ఏకగ్రీంగా ఎన్నిక :

చిన్నంపల్లి, ఐదుకల్లు గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి, గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. చిన్నంపల్లి గ్రామ అధ్యక్షుడిగా శివశంకర్, ఉపాధ్యక్షుడిగా బోయ రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా రంగస్వామి, గురుస్వామి, అరులయ్య, ఐదులకల్లు గ్రామ అధ్యక్షుడిగా మత్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా ఆర్.లింగమయ్య, ప్రధాన కార్యదర్శిగా కురుబ ఓంకార్, వీరితో పాటు కార్యదర్శులను గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు స్పందన


జామియా మసీదులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక జామీయ మసీదు వద్ద ఉన్న జామియా తాసీరియా ఎడ్యుకేషనల్, చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. మత గురువు సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ ఆశీస్సులతో చారిటబుల్ సొసైటీ చైర్మన్ సయ్యద్ తాసీర్‌బాబా ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త సొల్లల్లాహు అలైహి వసల్లం జయంతి సందర్భంగా మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర (సీరతున్ నబీ ఇమ్తిహన్)పై పోటీలకు జిల్లా వ్యాప్తంగా స్పందన వచ్చింది. దీంతో వ్యాసరచన పోటీలకు 100 మంది బాలికలు, 107 మంది బాలురు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరుకు పోటీలు జరిగాయి. ఈసందర్భంగా ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ సయ్యద్ తాసీర్‌బాబా మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి గోల్డ్‌మెడల్, రెండో విజేతకు సిల్వర్ మెడల్, మూడో విజేతకు రూ.3వేల నగదు అందిస్తామన్నారు. సెప్టెంబర్ 5న మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని, 6న విజేతలకు బహుమతులు అందించున్నట్లు తెలిపారు.

నీలగిరిస్వామికి ప్రత్యేక పూజలు



వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలోని నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు.


కణేకల్లు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అ పూర్వ సమ్మేళనం

కణేకల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఎంతో సరదాగా జరిగింది. 26 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట చేరి, నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సొంత ఊళ్లో పదో తరగతి వరకు చదివి ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ బిజీగా ఉంటున్న మిత్రులంతా కలిశారు... మురిశారు. తొలుత సర్వసతి పూజ నిర్వహించారు. చదువు చెప్పిన గురువులు శివ చిక్కణ్ణ, జయరాజ్, హబీబ్, తిరుపాలరెడ్డి, వెంకటేశ్వర్లతో ఆశీస్సులు తీసుకున్నారు. గురువులకు మెమొంటోలను అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. పూర్వ విద్యార్థులు సప్తగిరి బాలు, మోహన్, అహమ్మద్, మహేష్, శివరాజ్, ఫజులు, లోకనాథ్ తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల అరెస్టు


విడపనకల్లు వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు


విడపనకల్లు ఆంధ్ర సరిహద్దు వద్ద ఎన్టీఆర్ అభిమానులను అరెస్టు చేస్తున్న పోలీసులు

విడపనకల్లు: జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు నిరసనలు తెలుపుతున్నారు. ఆదివారం దాదాపు 40 మంది దాకా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు దగ్గుపాటి క్షమాపణ చెప్పాలని కర్ణాటక బళ్లారి నుంచి అనంతపురానికి ఎనిమిది వాహనాల్లో తరలివెళ్తున్నారు. సమాచారం అందుకున్న ఉరవకొండ టౌన్ సీఐ మహానంది, విడపనకల్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ పోలీసు సిబ్బంది కలసి అరెస్టు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన అనుచిత వాఖ్యలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి నిరసన తెలపాలని ఎన్టీఆర్ సేవా సమితి కర్ణాటక అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నేపథ్యంలో ఆంధ్ర సరిహద్దులో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. బేషరతుగా ఎన్టీఆర్‌కు ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

వజ్రకరూరు: మండల కేంద్రంలో తొమ్మిది మంది జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులను స్థానిక పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బళ్లారికి చెందిన జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు రెండు వాహనాల్లో బళ్లారి నుంచి అనంతపురం వెళ్తుండగా వజ్రకరూరు సమీపంలో వారిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఇటీవల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

ఏపీటీఎఫ్ రాయదుర్గం జోన్ నూతన కమిటీల ఎన్నిక


ఎన్నికైన మండలాల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

రాయదుర్గంటౌన్: ఏపీటీఎఫ్ రాయదుర్గం జోన్ పరిధిలోని రాయదుర్గం అర్బన్, మండలం, గుమ్మఘట్ట మండలశాఖల నూతన కార్యవర్గ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు హాజరు కాగా, వారి సమక్షంలో కమిటీల ఎన్నిక జరిగింది. రాయదుర్గం పట్టణశాఖ అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.మల్లికార్జున, రాయదుర్గం మండల శాఖ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టి.సునీల్, గుమ్మఘట్ట మండలశాఖ అధ్యక్షుడిగా పాండురంగ, ప్రధాన కార్యదర్శిగా సిద్దేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కంది పంటకు తుపాన్ దెబ్బ


కమ్మూరు వద్ద తెగుళ్ల బారిన పడిన కంది పంట

కూడేరు: ఈనెల ఆరంభం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని జడివాన కురవడంతో ఖరీఫ్‌లో సాగైన కంది పంటపై ప్రభావం పడింది. మండల పరిధిలోని జల్లిపల్లి, బ్రాహ్మణపల్లి, కమ్మూరు,కూడేరు, కొర్రకోడు, మరుట్ల, ఇప్పేరు, ఉదిరిపికొండ, చోళసముద్రం, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకు పైగా కంది పంట సాగు అయ్యింది. తుఫానుతో కందికి బూడిద తెగులు సోకింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా పంట సాగైన రెండు నెలల్లోపు తెగుళ్ల ఆశించవు,కానీ వాతావరణంలో మార్పులతో తెగుళ్ల బెడద పట్టుకుంది. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలివ్వాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు.. సమస్య తీరేదెన్నడు?


రామాలయం వద్ద ప్రధాన రోడ్డుపై మురుగు నీరు నిల్వడంతో అధ్వానంగా ఉన్న దృశ్యం

కూడేరు: కూడేరులో రామాలయం వద్ద డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరి అపరిశుభ్రత తాండవిస్తోంది. దుర్వాసన వస్తుండడంతో రోడ్డు పక్కన నివాసం ఉన్న ప్రజలు భరించలేకపోతున్నారు. మరోవైపు దోమల బెడద అధికమైంది. దోమ కాటుతో జనం రోగాల బారిన పడుతున్నారు. మురుగునీటిపై నడవాలంటే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో నడిబొడ్డున రోడ్లు మురుగునీటితో అధ్వానంగా మారిన అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

శుభకార్యం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: జక్కలవడికి మాజీ సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ బలరాం కుమారుడు శివరాజు, పల్లవి వివాహ రిసెప్షన్ వేడుకల్లో రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఆదివారం రాత్రి జక్కలవడికిలో శివరాజు, పల్లవిల రిసెప్షన్ జరిగింది. సమన్వకర్త మెట్టు ఈ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, బోయ రమేష్, బోయ రామకృష్ణ, భీమిరెడ్డి, టైలర్ వెంకటేశులు, గిర్రప్పరెడ్డి, అనిల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామిరెడ్డి, భోగిరెడ్డి, కె.వంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్

బెళుగుప్ప: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతర కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహ ఆవరణలో విద్యార్థులతో కలసి ఆర్‌డీటీ సేవల పునరుద్ధరించాలని డిమాండ్ చేశాడు. జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్‌డీటీ ని ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భాస్కర్, మణికంఠ, గోపి, చంటి, రమేష్, రాజశేఖర్, గోపీనాథ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కొడుకు టీచర్ కొలువుకు ఎంపిక


ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన అనిల్‌ను సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతీనగర్‌కు చెందిన సివిల్ సప్లై హమాలీ గోవింద్ కుమారుడు అనిల్ కుమార్ డీఎస్సీలో 87.5 మార్కులు (స్కూల్ అసిస్టెంట్)తో జిల్లాలో నాల్గో ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, అనిల్‌ను ఆదివారం సన్మానించారు. తల్లితండ్రులు గోవింద్, రామాంజినమ్మ కష్టాలను చూసి వారు చేస్తున్న కష్టాన్ని ఎలాగైనా తీర్చాలని కష్టపడి ఉద్యోగం సాధించానని అనిల్ తెలిపాడు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్వీ నాయుడు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో యువకుడి ప్రతిభ


డీ దాదావలి

కళ్యాణదుర్గం : మండలంలోని విట్లం పల్లికిచెందిన పేదింటి యువకుడు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లి గ్రామానికి చెందిన రసూల్ బీ.చిన్న వన్నూర్ సాబ్ కుమారుడు డి. దాదావలి 2025 డీఎస్సీ ఫలితాల్లో 82.5 మార్కులతో జిల్లా ర్యాంకు 22తో పీడీ (ఫిజికల్ డైరెక్టర్) గా ఎంపికయ్యాడు. దీంతో ఆదివారం తమ గ్రామానికి చెందిన యువకుడు ప్రతిభ కనబరచడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు.